# కొత్తఆట



**కా**లేజీ సీట్లు గొడవతో మా అందరికీ పిచ్చెకినట్లయింది కొద్దిరోజులపాటు. అందుచేత ఇంకెలాంటి సమస్యల జోలికి పోకుండా ప్రశాంతంగా కొంతకాలం గడపాలని నిర్ణయించుకున్నాము. శాయిరామ్‌కి, యాదగిరికీ చాలా గట్టి వార్నింగ్ ఇచ్చాడు రంగారెడ్డి. కొద్దిరోజులు కాలనీలో ఎలాంటి మీటింగులూ పెట్టవద్దని. పాపం శాయిరామ్, యాదగిరి నాలుగు రోజులపాటు ఏయాక్టివిటీ లేకుండా ఇంట్లో కూర్చోటానికి చాలా ఇబ్బంది పడిపోవటం మేము చూస్తూనే ఉన్నాము. కానీ తమాషా ఏమిటంటే నాలుగురోజులు గడిచేసరికి మాకే ఏ కార్యకలాపాలూ లేకుండా ఇంట్లో కూర్చోవటం చాలా చిరాకుగా తయారయింది. చివరకు నేనే ఆ చిరాకును భరించలేక ఆ ఉదయం రంగారెడ్డి ఇంటికి చేరుకున్నాను. రంగారెడ్డి అప్పుడే తనపెన్ కనిపించటం లేదన్నమిషతో ఇంట్లో భార్యాపిల్లలతో యుద్ధం చేస్తున్నాడు.

"అబ్బబ్బ! ఈ నాలుగు రోజుల్నుంచీ ఛస్తున్నాను మీ గొడవతో. ఏదొక మీటింగో,

పాడో ఉంటేగానీ, నా ప్రాణానికి హాయిగా ఉండదు. పాపం ఆ ఉదయార్కర్ భార్యకూడా ఇదే గొడవ! నాలుగు రోజులు ఇంటిపట్టున ఉండేప్పటికి ఏదోక మడత పేచీ పెట్టుకుంటున్నారట ఆ అన్నయ్యగారు" అంటోందామె.

"ఈ మగజాతే అంత! ఒకర్నని ఏం లాభం" అంటోంది మా ఆవిడ.

నేను గతుక్కుమన్నాను.

మా ఆవిడ మీద కోపం వచ్చేసింది– నా గురించి అలా బ్యాడ్ పబ్లిసిటీ ఇస్తున్నందుకు.

"ఏమిటి గురూ! ఎంతసేపయింది వచ్చి!" అడిగాడు రంగారెడ్డి బయటి కొచ్చిన న్ను చూసి. అతని భార్యకూడా నాలిక్కరచుకుంది నేను రావటం చూసి.

"ఇప్పుడే! మీ మిసెస్ మాట్లాడుతోందేమీ వినలేదింకా" అన్నాన్నేను ఎవరికీ ఇబ్బంది కలుగకుండా.

"అవునవును! దొండకాయలు చూడరాదూ? మరీకిలో ఐదు రూపాయిలట! కిందటి సంవత్సరం ఇదే రోజుల్లో మూడు రూపాయలకు కొన్నాం" అన్నాన్నేను కూడా నాటకమాడుతూ.

"శాయిరామ్ దగ్గరకు వెళ్దాంపద" అన్నాడు రంగారెడ్డి మళ్ళీ మాటమార్చేస్తూ. ఇద్దరం శాయిరామ్ ఇంటికి చేరుకున్నాం! అప్పటికే అక్కడబోలెడు మంది కాలనీ పిల్లలను జమచేసి ఆవేశంగా ఏదో ఉపన్యాసం ఇస్తున్నాడు శాయిరామ్.

"నాకు తెలుసు! మన కాలనీ పిల్లలకు ఒక్క టి.వి. తప్పితే వేరే కాలాక్షేపాలేమీ లేవని! కానీ ఆ టి.వి. లోనేమో కళకు అంకితమయినా ప్రోగ్రామ్స్ ఎక్కువ. దానినుంచి మనం నేర్చుకునేది– ముఖ్యంగా పిల్లలు నేర్చుకునేదేమిలేదు. అదివరలో పిల్లలందరినీ రిపబ్లిక్ పెరేడ్‌కూ, స్వాతంత్ర్యదినోత్సవం వేడుకలకూ, నెహ్రూ పుట్టినరోజు సరదాలకూ ఇలా ఎన్నో కార్యక్రమాలకు తీసుకెళ్ళేవాళ్ళు. అక్కడ గవర్నర్. ప్రధానమంత్రి ఇతరమంత్రులూ, పురప్రముఖులూ కనిపించేవాళ్ళు. వాళ్ళు ఇచ్చే ఉపన్యాసం విని ఎంతోమంది ఉత్తేజితులయ్యేవాళ్ళు. అలా దేశనాయకుల నడవడి, వారి సంస్కృతి ఎంతోమంది పిల్లలకూ, పెద్దలకూ కూడా ఆదర్శప్రాయమయింది" అంటూ చెప్పిమమ్మల్ని చూసి ఆశ్చర్యపోయాడు.

"ఏం గురూజీ! ఏమిటిలా వచ్చారు?" అడిగాడతను– నేను రెడ్డీ ఇద్దరం తడబడ్డాము.

"అబ్బే! ఏమిలేదు– ఊరికే అలా" అన్నాన్నేను.

"మీరేమనుకుంటారోనని మీ దగ్గరకు రాలేదు మీకు ఓ విషయం చెప్పాలి" అన్నాడు శాయిరామ్ కొంచెం జంకుతూ.

"అబ్బే! ఏం ఫర్లేదన్నా చెప్పు! ఏమిటది? ఏమిటది?" అంటూ మా వెనుకనుంచీ ముందుకి దూసుకొచ్చి అడిగాడు యాదగిరి. అతను మా వెనుక ఎప్పుడు చేరాడో మాకే

తెలీదు. అనుమానం వచ్చి వెనక్కు తిరిగిచోసేసరికి గోపాల్రావ్, చంద్రకాంత్ ఛటోపాధ్యాయ్ కూడా నిలబడి ఉన్నారు.

"ఏమిటీ? మీరందరూ బయల్దేరేసరికి ఏమయినా విశేషం ఉందేమోనని–" అన్నాడు గోపాల్రావ్ ఆశగా.

"ఏమీ లేదు" అన్నాన్నేను.

అంతా నిరాశపడిపోయారు.

"కానీ శాయిరామ్ ఏదో విషయం చెప్పాలంటున్నాడుగా?" అడిగాడు యాదగిరి.

"ఏమిటది?" అడిగాడు రంగారెడ్డి శాయిరామ్‌ని ఆత్రుతగా.

"అదే! ఇవాళ పేపరులో వేశారు కదా! మనకాలనీ వెనుక వేపున్న గుడిశెల్లో ఆ మధ్యకాలిపోయినా రెండు గుడిసెలు చూడ్డానికి మన ప్రధానమంత్రి ఉత్తమకుమార్‌గారూ, మన ముఖ్యమంత్రి నిత్యానందంగానూ వస్తున్నారని! బహుశా మన గవర్నర్ మహాధీర్ కూడా వస్తారనుకుంటాను. కనుక ఇది మన కాలనీ పిల్లలందరూ అపూర్వ అవకాశం! మనం చిన్నపిల్లలుగా వున్నప్పుడు ప్రెసిడెంట్ వస్తున్నాడన్నా, ప్రధానమంత్రి వస్తున్నాడన్నా ఎంత వేడుకగా ఉండేది? వాళ్ళు చెప్పేమాటలు వింటూంటే మనకెంత ఇన్‌స్పిరేషన్ వచ్చేది?" ఆవేశంగా అన్నాడు శాయిరామ్.

"అవునవును! అప్పట్లో పేపరులో చూశాను! ఓ దొంగ నెహ్రూగారి మీటింగ్‌కొచ్చి ఆయన ఉపన్యాసం విని ముగ్ధుడయి దొంగతనం త్యజించి చదువుకుని యూనివర్శిటీ ప్రొఫెసర్ అయిపోయాడట" అన్నాడు గోపాల్రావ్.

"అంతేకాదు! మన ప్రెసిడెంట్ బాబూ రాజేంద్రప్రసాద్‌గారి ఉపన్యాసం విని ఒక తాగుబోతు తాగుడు మానేశాడట–" అన్నాడు జనార్ధన్.

"డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణగారు కారులో వెళ్తూ తనను చూడ్డానికి నిలబడ్డ పిల్లల్లో ఓ కుర్రాడి తలనిమిరి ప్రేమగా ఏం చదువుతున్నవ్‌బాబూ? అని అడిగి నాలుగు మంచి మాటలు చెప్పేసరికి అంతవరకూ ఆకతాయిలుగా చదువూ సంధ్యా లేకుండా తిరుగుతున్న ఆ పిల్లలందరూ స్కూలు కెళ్ళటం ప్రారంభించారుట–" అన్నాడు చంద్రకాంత్.

"అందుకని మనకాలనీ వాళ్ళందరం కలసి మన పిల్లలతో ఆ గుడిశెల దగ్గరకు వెళ్ళి ప్రధానమంత్రికి, పూలదండ వేయిస్తే బావుటుంది" అన్నాడు శాయిరామ్.

ఆ ఆలోచన మా అందరికి వెంటనే నచ్చింది. పిల్లలంతా కూడా వెళ్దాం వెళ్దాం అంటూ కేకలు వేయసాగారు ఉత్సాహంగా. అప్పటికప్పుడే కాలనీ మీటింగ్ ఏర్పాటు చేసేశాడు శాయిరామ్, భయంకరమయిన ఆనందంతో! ఆడాళ్ళు పిల్లలూ విరివిగా వచ్చేశారు మీటింగుకి.

"సోదర సోదరీమణులారా! నేడు మనకు పర్వదినం" అన్నాడు శాయీరామ్ మైక్ ముందు కొచ్చేసరికి హఠాత్తుగా విజృంభిస్తూ.

"ఎందుకు పర్వదినం?" అని వెనుకనుంచి కాలనీ విద్యార్థులు అరచారు బిగ్గరగా.

"ఎందుకంటే ఎందుకంటే... ఏమో నాకు తెలీదు. సాధారణంగా రాజకీయ మీటింగుల్లో అలా అంటారు కాబట్టి అన్నాను–" అన్నాడతను తడబడి.

"అయితే ఆ మాట విత్‌డ్రా చేసుకో" అరచారు కుర్రాళ్ళు

శాయీరామ్ విత్‌డ్రా చేసుకున్నాడు.

"సోదర సోదరీమణులారా! ఈ రోజు మామూలు దినం! ఇప్పుడు ముఖ్యమయిన విషయం ఏమిటంటే మనకాలనీ వెనుకవేపు ఉన్న వీకర్‌సెక్షన్స్ గుడిశెలకు మన ప్రధానమంత్రి ఉత్తమ్‌కుమార్‌గారు, మన ముఖ్యమంత్రి నిత్యానందగారు, ఇంకో రెండుగంటల్లో వస్తున్నారని తెలిసింది. కనుక మనందరం వెళ్ళి మనకాలనీ పిల్లల ద్వారా వారికి పూలదండ వేయించి వారితో కొద్ది నిముషాలు సంభాషించేలా చేస్తే మన పిల్లలందరూ కూడా ఆ మహానీయుల సూక్తులు విని, ఆ సంస్కృతి అవలంబించి సత్ప్రవర్తనులయి మహోన్నతమయినటువంటి స్థితికి ఎదుగుతారని నా అభిప్రాయం! మీరేమంటారు?"

ఆడాళ్ళూ, పిల్లలు ఏకగ్రీవంగా తమ అంగీకారాన్నీ, ఉత్సాహాన్నీ తమ హర్షధ్వానాల ద్వారా తెలియజేశారు. ఎంచేతో మగాళ్ళు మాత్రం ఏమంత ఉత్సాహం చూపలేరు. సరే– మన భారతదేశంలో మగాళ్ళ అభిప్రాయాలకు రాజకీయాలూ, సినిమాలూ ఎప్పుడూ ప్రాముఖ్యత ఇవ్వవ్ గనుకమేమూ ఇవ్వదల్చుకోలేదు.

అప్పటికప్పుడే కాలనీ తాలూకు కిచెన్ గార్డెన్‌లో ఉన్న రకరకాల పూలు తీసుకురావడం, క్షణాల్లో పూలదండ తయారుచేయడం జరిగిపోయింది. అందరం ఓ అరగంట ముందుగానే వెళ్ళి బలహీనవర్గాల వాళ్ళు గుడిశెల దగ్గర నిలబడ్డాం. సరిగ్గా అరగంట గడవగానే పోలీస్ సైరన్లు, జనాన్ని వెనుకకు తోస్తున్న కేకలూ వినిపించాయి. మరుక్షణంలో అతివేగంగా పైలెట్ పోలీస్ జీప్ వచ్చికాలనీలోకి తిరిగిపోయింది. కానీ దాని వెనుకే వస్తున్న ప్రధానమంత్రి కారు మాత్రం కాలనీ వేపు తిరగకుండా అతివేగంగా దుమ్ములేపుకుంటూ వెళ్ళిపోయింది. జనం, పోలీసులూ హాహాకారాలు చేశారు.

''అరె! ప్రధానమంత్రి ఇటు తిరగకుండా తిన్నగా వెళ్ళిపోయాడేమిటి?'' అనుకుంటున్నారు అధికారులు. ఈలోగా ఆకారు వెనుకే గవర్నరూ, ముఖ్యమంత్రికారు కూడా వేగంగా వెళ్ళిపోయాయి. బలహీన వర్గాలందరూ నిరాశపడిపోయారు.

"మా తగలబడిన గుడిశెలు చూడ్డానాకి ప్రధానమంత్రి గారొస్తోన్నారని చెప్తే

ఆనందించాం బాబు! కానీ ఆయన చూడకుండానే వెళ్ళిపోయారు" అన్నారు వాళ్ళు. మేము కూడా నిరాశగా పోలీస్ అధికారులు దగ్గరకెళ్ళాం.

"ప్రధానమంత్రిగారు– ఈ కాలనీ కొస్తారని పేపరులో వేశారుకదా! అలా ఆగకుండా ఇంకెక్కడికో తిన్నగా వెళ్ళిపోయారేమిటి?" అడిగాడు రంగారెడ్డి.

"అది మామూలేనయ్యా! ఎప్పుడూ నూటపాతిక్కిలోమీటర్ల స్పీడ్‌లో కారు తోలటం ప్రధానమంత్రిగారికి హాబీ! అందుకని అప్పుడప్పుడూ అలా కొంతదూరం కారు తోలుకుంటూ వెళ్ళి మళ్ళీ వెనక్కుతిరిగి వచ్చేస్తారు–" అన్నారు.

పదినిమిషాల తర్వాత వాళ్ళన్నట్లే మళ్ళీ అదేవేగంతో వచ్చి సడన్‌బ్రేకులతో ఆగినాయి కార్లు. ప్రధానమంత్రి ఉత్తమ్‌కుమార్‌గారు చాలాచలాకీగా కారులోనుంచి కిందకుదిగారు. వెంటనే గవర్నరు, ఇతర అధికారులు, ప్రధానమంత్రి తాలూకా 'ఉరి' అనే పార్టీ నాయకులూ ఆయనను చుట్టుముట్టారు.

"అబ్బ! కారు చాలా స్పీడుగా డ్రైవ్‌చేశారు సార్ మీరు" అన్నారు వాళ్ళ పార్టీనాయకులు.

"మొన్న రాజస్తాన్‌లో హరిజనుల మీద అగ్రవర్ణాల వాళ్ళదాడి జరిగినప్పుడు కూడా వెళ్లానుకదా! అక్కడా ఇంకా బోలెడు స్పీడుగా నడిపేశాను ఇహి..." అన్నాడు ప్రధానమంత్రి.

"అవున్సార్! అప్పుడు దుమ్ముకూడా సరిగ్గా మూడొందల రెండు మీటర్ల ఎత్తుపైకి లేచింది! దుమ్ముపైకి లేవటంలో రాజస్తాన్ ట్రిప్ రికార్డ్‌బ్రేక్ సార్" అన్నాడు పార్టీ నాయకుడు కాకారావ్.

"కాదు సార్! అలహాబాదు ట్రిప్‌లో మూడొందల రెండు మీటర్ల పైన ఆరుసెంటీమీటర్లు ఎత్తు దుమ్ములేపారు" అన్నాడు మరో నాయకుడు బాకారావ్.

"ప్రపంచంలో అంతెత్తు దుమ్ములేపిన ప్రధానమంత్రి మీరొక్కరేనని నిన్నే గిన్నిస్‌బుక్ ఆఫ్‌వరల్డ్ రికార్డ్స్‌కి రాసి పంపిచాను సార్" అన్నాడు ఇంకో తబలారావ్.

ప్రధానమంత్రి అతని వేపు ప్రేమగా చూశాడు.

"ఇంకా వెళ్ళిపోదామా?" అడిగాడతను.

అందరూ అదిరిపడ్డారు. ప్రోగ్రాం ప్రకారం మీరు అగ్రకులాలవారు తగులబెట్టిన ఆ బలహీన వర్గాల వాళ్ళ గుడిసెలను చూడాల్సి ఉందండీ అన్నారువారు.

"ఓ! అవునవును! ఈకారు స్పీడ్ డ్రైవింగ్ గొడవలో ఆసంగతి మర్చేపోయాను–" అంటూ గుడిసెలవేపు నడిచాడు ఉత్తమ్‌కుమార్.

మేము ముందే ఇచ్చిన సూచనల ప్రకారం మా కాలనీ పిల్లలందరూ "చాచా ఉత్తమ్ జిందాబాద్" అంటూ అరచారు. అరడజనుసార్లు ఉత్తమ్ మావేపు చేయివూపి గుడిసెల వాళ్ళ దగ్గరకు నడిచారు. అప్పటివరకూ దూరంగావున్న బలి అనే పార్టీ వారితో మరో

గ్రూపుగా నడుస్తోన్న ముఖ్యమంత్రి నిత్యానందం ఒక్క పరుగుతో ముందుకి వచ్చేశాడు.

ప్రధానమంత్రి తాలూకా 'ఉరి' పార్టీనాయకులు అప్పటికే ఓ గుడిసెలకు చెందిన ముసలమ్మచుట్టూ ఫెన్సింగ్‌లా నిలబడ్డారు, ప్రధానమంత్రిని చూడగానే ఆమె "ఓరి దేవుడో, రావుడో! నా గుడిసెను 'బలి' పార్టీవాళ్ళు బలి తీసుకునాగ్రో నాయనో" అనే అర్థం వచ్చేట్లు కపాలి బాషలో పెద్దఎత్తున ఏడ్చేయసాగింది.

"ఏం జరిగిందమ్మా? ఏం జరిగింది?" అంటూ అడిగాడు ప్రధానమంత్రి బెంగాలీలో. ఆ స్త్రీ కపాలీ బాషలో జవాబిచ్చింది.

"గుంగ్రోకసో మాసిజీర కసాను భమర్ తణా" అందామె ఏడుస్తూనే.

వెంటనే పార్టీ నాయకుడు కపాలీ బాషనుంచి తనకు తెలిసిన భగోరా అనే భాషలోకి ఆమె మాటల్ని అనువాదం చేశాడు.

"ఆగామణ్‌బా తగీలాబాగ్రామూశ్చెన్‌తీరా బోస్‌కమ్‌సూని" అన్నాడతను. ప్రధానమంత్రి తెల్లమొఖం వేశాడు.

"నాకు భగోరా భాషరాదని అతనికి చెప్పండి" అన్నాడు పక్కనున్న పధ్నాలుగురు అనువాదకుల నుద్దేశించి. వెంటనే కపాలీ భాషనుంచి హిందీలోకి అనువాదం చేయగల అనువాదకుడు ముందుకొచ్చాడు అతను ఉన్నదున్నట్లు అనువాదం చేసేశాడు. "మా మగోడు తాగొచ్చి బీడీ అర్పకుండానే విసిరేస్తే ఇల్లంటుకుంది."

హఠాత్తుగా "ఉరి' పార్టీ నాయకుడు ఒక్క ఎగురెగిరి ఆ అనువాదకుడి మీదపడి పీక నొక్కేశాడు. వెంటనే ఇంకో 'ఉరి' నాయకుడు అనువాదం మొదలు పెట్టాడు.

"ఆమె, ఆమెభర్త కూలిచేసుకుని వచ్చి వంటచేసుకుంటూండగా ప్రాంతీయపార్టీ అయిన 'బలి' పార్టీ నాయకులు కిందటి ఎన్నికల్లో తగాదాల కారణంగా తామిద్దరినీ తన్ని కత్తితో పొడిచి, గుడిశెతగలబెట్టి పారిపోయారని ఆమె ఆక్రోసిస్తూ చెప్తోందిసార్! రాష్ట్రప్రభుత్వానికి ఎన్ని మహజర్లు పెట్టుకున్నా, పోలీసులకు ఎన్ని ఫిర్యాదులు చేసినా ఆమెగోడు ఎవరూ పట్టించుకోలేదని ఆమె కడివెడు కన్నీరు కారుస్తూ చెపుతోంది సార్"

అతనిమాట పూర్తికాకుండా అతనిని ఒక్కతోపుతోసి ముఖ్యమంత్రి నిత్యానందం ముందుకొచ్చాడు. "ఇదంతా ఆభూత కల్పన! అందుకు నిదర్శనం ఈ 'ఉరి' పార్టీ అనువాదకుని కపాలీ భాష రాకపోవడమే" అన్నాడు నిత్యానందం.

"వచ్చు! అమె చెప్తోన్నదేమిటంటే ఆమె ఒకప్పుడు 'ఉరి' పార్టీకి చెందినమనిషేకాని, ఈ మధ్య 'బలి' పార్టీలో చేరడంవల్ల 'ఉరి' పార్టీ వాళ్ళు ఆమె గుడిశె తగులబెట్టి ఆమెను చంపబోయారనీ–"

ముఖ్యమంత్రి మాట పూర్తికాకుండానే 'ఉరి' పార్టీ కేంద్రమంత్రి ముందుకి చొచ్చుకొచ్చాడు.

"అబద్ధం! ఆ స్త్రీ చెప్పినదేమిటంటే ఆమె ఇంతకుముందు 'ఉరి' పార్టీలో వుండేదని, కానీ బలి పార్టీ నాయకులు ఆమెను బలవంతంగా....."

"అంతా అబద్ధం! ఆ భూత కల్పన! దుర్మార్గం" అన్నాడు ముఖ్యమంత్రి.

"నోర్ముయ్! నీకు కపాలీ భాషరాదని నాకు తెలుసు!" అన్నాడు 'ఉరి' పార్టీకి చెందిన కేంద్రమంత్రి.

"ఏడ్చావ్! కావాలంటే కాగితం తెచ్చుకో! ఆ భాషలో సంతకం చేస్తాను" అన్నాడు ముఖ్యమంత్రి కోపంగా. "పోరా వెర్రివెంగళాయ్" అన్నాడు కేంద్రమంత్రి.

"నువ్వే పోరా పిచ్చిపుల్లయ్–"

"పోరా బాడ్‌కవ్–"

"నీయవ్వ– మక్కిలిరగదంతా!"

"నాకొడకా! ఒక్కలాత్‌కొడతా"

మేమంతా నిశ్చేష్టులై చూస్తూండిపోయాం. కానీ మా కాలనీ పిల్లలు హఠాత్తుగా ఆ తిట్లకు పులకరించిపోయారు. ఆ ఇద్దరూ తిట్టుకునే ప్రతి తిట్టుకీ తప్పట్లు కొట్టి ఉత్సాహంతో "అబ్బ! అబ్బ భలే తిట్టాడు! భలే తిట్టాడు" అంటూ ఆనందం వ్యక్తం చేయసాగారు.

పావుగంట తర్వాత గవర్నర్ మహాధీర్ మధ్యకి దూకి ఇద్దరినీ తిట్టుకోకుండా సమాధానపరచాడు.

ముఖ్యమంత్రి నిత్యానందం కోపంగా ప్రధానమంత్రి ఉత్తమ్‌కుమార్ వేపు తిరిగాడు.

"ఇదంతా మీరిస్తున్న ఆలుసు ఆ నాకొడుక్కి! లేకపోతే ముఖ్యమంత్రిని అన్ని తిట్లు తిట్టడానికి ఎంతధైర్యం?" అన్నాడు మండిపడుతూ. దాంతో ఉత్తమ్‌కుమార్‌కి కోపం వచ్చింది.

"ఆల్‌రైట్! నేనే ఆలుసిచ్చాను! అయితే ఏమంటావ్?"

"ఏమంటానా? నీలాంటి చేతకాని నాకొడుకు ప్రధానమంత్రిగా ఉంటానికి అనర్హుడంటాను."

"బాడ్‌కవ్ సాలే! నువ్వెవడివిరా ఆ మాటంటానికి? నా ప్రజలు నన్ను ప్రధానిగా ఉ ండమని ఎన్నుకున్నారు!"

"అలాగా! నీ కోఫర్స్ కుంభకోణం తెలీక ఎన్నుకున్నార్రా నిన్ను? చిల్లర్‌నాయాలా!"

"ఓరేయ్! నీ గాచారం భూముల కుంభకోణం సంగతి ఎవడికీ తెలీదనుకోకు! నంగా సాలే"

"నీ ఫ్రెండ్ గబితాబ్‌బచన్ విదేశీ బ్యాంక్ నిల్వలు నాకూ తెలుసు".

"అలాగా నీ అల్లుడికి నువ్విచ్చిన కంప్యూటర్స్ లైసెన్స్ కుంభకోణం నాకూ తెలుసు!"

"అలాగా! నీ బామ్మర్ది పేరుమీద నువ్‌సగంఢిల్లీ కొన్న విషయం ఎవడికీ తెలీదనుకోకు"

"నీ తమ్ముడి పేరుమీదా, మీ అబ్బాయ్ పేరుమీద నువ్ సగం రాష్ట్రం కొనేయడం చిన్నపిల్లలకు కూడా తెలుసు-"

"ఒరేయ్! నీ అంతుచూస్తా(నా-" "పోరా-...... డి.కే."

ఇద్దరికీ ఫైటింగ్ ప్రారంభమయ్యేసరికి గవర్నర్ మధ్యలో దూరి ఇద్దరినీ విడదీశాడు. దాంతో అప్పటికప్పుడే 'ఉరి' పార్టీవాలంటీర్లు 'బలి' పార్టీవాలంటీర్లు తమ తమ పార్టీలకు జిందాబాద్ చెప్తూ కేకలు మొదలు పెట్టారు.

"నా కొడకా- ఢిల్లీ రా బే! నీ అంతు తేలుస్తా-" అన్నాడు ఉత్తమకుమార్.

మళ్ళీ గవర్నర్‌వచ్చి ఇద్దరినీ విడదీశాడు.

ఉత్తమ్‌కుమార్ వెళ్ళిపోబోతుంటే మేము వెంటపరుగెత్తాము.

"సార్! మా కాలనీ పిల్లలు మీకు దండవేయడానికి వచ్చారు" అన్నాడు రంగారెడ్డి ప్రధానమంత్రితో. ప్రధానమంత్రి సంతోషంగా మా కాలనీ పిల్లల దగ్గరకొచ్చాడు తీరా ఆయనకు మా వాళ్ళు దండవేయబోతూన్న సమయంలో ముఖ్యమంత్రి నిత్యానందం కూడా పరుగుతో వచ్చి పిల్లలందరి భుజం తట్టి. "నాకోసం దండతెచ్చారా. థాంక్యూ" అన్నాడు మెడముందుకిచూస్తూ.

"దండ నాదిరా బాడ్‌కవ్" అన్నాడు ఉత్తమ్‌కుమార్ దండలాక్కోబోతూ.

"నాది బే బేశరం సాలే" అంటూ తనూ ఒక్కలాగు లాగాడు నిత్యానందం.

దండ రెండు ముక్కలయింది.

దాంతో 'ఉరి' పార్టీవాళ్ళూ 'బలి' పార్టీవాళ్ళూ కలబడ్డారు హఠాత్తుగా. మేము వెంటనే పిల్లల్ని తీసుకుని మా కాలనీవేపు పరుగెత్తాము.

ఇది జరిగి వారం రోజుల తర్వాత ఓ రోజు సాయంత్రం మేమంతా కాలనీ వేదిక దగ్గర కూర్చుని మాట్లాడుకుంటూంటే కాలనీ పిల్లలందరూ ఆడుకోవడం చూచాము.

"ఇవాళ కొత్తరకం ఆట ఆడుదామురా!" అన్నాడు ఒకడు.

"ఏమిట్రా అది" అందరూ వాడిచుట్టూ మూగారు.

"ప్రధానమంత్రి- ముఖ్యమంత్రీ ఆట-"

అందరూ చెరోవేపుకి వెళ్ళి నిలబడ్డారు.

"ఒరే దొంగనాయాలా! నువ్ లోఫర్ విరా?"

"నువ్ డబుల్ లోఫర్‌విరా సాలే" "చల్‌రే బాడుకవ్"

"చల్‌రే దొంగబాడుకవ్" "జారేలుచ్చే......... " "జారే లఫంగ్-"